సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం, 7, ఆగస్టు, 2024



7,203 క్యూసెక్కుల వరద

సోమశిల: జలాశయానికి 7,203 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. జలాశయం మంగళవారానికి 12.664 టీఎంసీలకు చేరుకుంది. దిగువకు 210 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.71,430
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.6,397
3 శాతం జీఎస్టీతో	రూ.6,589
నవర (8 గ్రా)	రూ.52,712

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35.7/28.4

జిల్లాలో బుధవారం ఆకాశం మేఘావృతంగా ఉండి అక్కడక్కడ చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. వాతావరణంలో తేమ 65 శాతం ఉంది.

న్యూస్‌రీల్

విద్యుత్ విజిలెన్స్ అధికారుల దాడులు

- జిల్లాలో 56 కేసుల నమోదు
- రూ.2.5 లక్షల జరిమానా విధింపు



మాట్లాడుతున్న జగదీష్, సుధాకర్

నెల్లూరు (వీఆర్సీసెంటర్): ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అక్రమంగా విద్యుత్ వాడుతున్న కనెక్షన్లపై మంగళవారం దాడులు నిర్వహించామని విద్యుత్ విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు జగదీష్, సుధాకర్ తెలిపారు. విద్యుత్ భవన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో వీరు మాట్లాడుతూ జిల్లా సర్కిల్ పరిధిలోని కోడూరు, వెంకటాచలం, కసుమూరు, బాలాయపల్లి ప్రాంతాల్లో విద్యుత్ చౌర్యం, అదనపు విద్యుత్ లోడ్ వాడుతున్న గృహాలు, దుకాణాలపై దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో 56 కేసులు నమోదు చేసి రూ.2.5 లక్షల జరిమానా విధించామన్నారు. విద్యుత్‌చౌర్యానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జోరుగా నెల్లూరు క్లబ్ ఎన్నికల ప్రచారం

- కోర్టు తీర్పు గురువారానికి వాయిదా
- ప్రచారంలో దూసుకుపోతున్న పొన్నవోలు ప్యానల్

నెల్లూరు (బారకాసు): నెల్లూరు క్లబ్ ఎన్నికల ప్రచారం జోరుగా కొనసాగుతోంది. ఈ ఎన్నికల్లో నెల్లూరు క్లబ్ పాలక వర్గం కోసం రెండు ప్యానల్స్ పోటీ పడిన విషయం విదితమే. అయితే ఇందులో పొన్నవోలు సుధాకర్‌రెడ్డి ప్యానల్ ప్రచారంలో దూసుకుపోతుంది. మరో ప్యానల్‌కు సంబంధించి వైస్ ప్రెసిడెంట్, ట్రెజరర్‌గా పోటీచేస్తున్న అభ్యర్థులు తమ మద్దతు పొన్నవోలు సుధాకర్‌రెడ్డికే అని చెప్పినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఓటు హక్కు కల్పించలేదని కొందరు కోర్టుకెళ్లిన సంగతి తెలిసిందే. అయితే కోర్టు తీర్పు మంగళవారం వెల్లడవుతుందనుకుంటే గురువారానికి వాయిదా పడింది. పొన్నవోలు ప్యానల్ ప్రచారం ముమ్మరంగా కొనసాగుతోంది. నెల్లూరు క్లబ్ ఎన్నికలు జరుగుతాయా? వాయిదా పడుతాయా అనేది కోర్టు తీర్పుపై ఆధారపడి ఉంది.

నెల్లూరు క్లబ్ ఈసీ మెంబర్ అభ్యర్థి మృతి



కొప్పాల లీలామోహన్‌రెడ్డి

నెల్లూరు (బారకాసు): నెల్లూరు క్లబ్ ఎన్నికల్లో పొన్నవోలు ప్యానల్ తరఫు ఈసీ మెంబర్‌గా పోటీ చేస్తున్న కొప్పాల లీలా మోహన్‌రెడ్డి (40) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. నెల్లూరురూరల్ మండలం పెనుబర్తి గ్రామానికి చెందిన ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. లీలామోహన్ సివిల్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. క్లబ్ ఎన్నికల ప్రచారంలో చురుగ్గా పాల్గొంటున్నారు. మంగళవారం ఉదయం నుంచి ఎన్నికల ప్రచారంలో ఉన్నారు. హఠాత్తుగా కుప్ప కూలిపోయాడు. హుటాహుటిన చికిత్స నిమిత్తం సమీపంలోని బొల్లినేని ఆస్పత్రికి తరలించగా అక్కడ వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న లీలామోహన్ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. లీలా మోహన్ మృతికి నెల్లూరు క్లబ్ సభ్యులతో పాటు ఎన్నికల్లో పోటీ చేస్తున్న సభ్యులందరూ తమ సంతాపాన్ని ప్రకటించారు.

డైమండ్ రాజా

సర్వేపల్లి నియోజకవర్గంలో విచ్చలవిడిగా జూదం

సర్వేపల్లి నియోజకవర్గం జూదానికి అడ్డాగా మారిపోయింది. పేకాట, డైమండ్ డబ్బా, నంబర్లాట, మూడు ముక్కల ఆటలు బహిరంగంగా నిర్వహిస్తున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. టీడీపీలో క్రియాశీలకంగా వ్యవహరించే కొందరు నేతలు పవిత్ర పుణ్యక్షేత్రాల్లో జూదాలు నిర్వహిస్తున్నా.. రూ.లక్షల్లో పందేలు జరుగుతున్నా పోలీసులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గ ముఖ్య నేత అండదండలతో ఈ శిబిరాలు జరుగుతున్నాయని, సదరు నేతకు రోజు వారీ వాటాలు వెళ్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

- పవిత్ర పుణ్యక్షేత్రాల వద్ద 'డైమాండ్ డబ్బా'
- రూ.లక్షల్లో జరుగుతున్న పందేలు
- తెలుగు తమ్ముళ్ల అనైతిక పనులు



సాక్షిప్రతినిధి, నెల్లూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సర్వేపల్లి నియోజకవర్గంలో ముఖ్య నేత కనుసన్నల్లో కొందరు టీడీపీ నేతలు జూదాలు నిర్వహిస్తున్నారు. సహజ వనరుల దోపిడీతో ప్రారంభించి, పరిశ్రమల నుంచి 'ఎస్' ట్యాక్స్ పేరుతో దందాల పర్వానికి తెర తీసిన టీడీపీ నేతలు పవిత్ర పుణ్యక్షేత్రాలైన గొలగమూడి వెంకయ్యస్వామి ఆలయం, కసుమూరులోని దర్గా పరిసర ప్రాంతాల్లో తమ్ముళ్లు కాయ్ 'రాజా' కాయ్ అంటూ 'డైమండ్ డబ్బా' ఆట నిర్వహించి సామాన్యులకు గుండు కొట్టి పంపుతున్నారు. పుణ్యస్థలాల్లోనే తమ్ముళ్లు అనైతిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నా.. పోలీస్ శాఖ చేష్టలుడిగి చూస్తోంది.

వెంకటాచలం మండలం గొలగమూడి వెంకయ్యస్వామి ఆలయం సమీపంలో నిత్యం డైమండ్ డబ్బా జూదం జరుగుతోంది. గడిచిన రెండు నెలలుగా ఓ టీడీపీ నేత స్వయంగా జూదం నిర్వహిస్తూ రూ.లక్షలు ఆర్జిస్తున్నాడు. డైమండ్ డబ్బా జూదంలో వందకు రెండొందలు ఇస్తానంటూ డబుల్ ధమాకా అంటూ ఆశ చూపి ఆలయానికి వచ్చిన భక్తుల జేబులు చిల్లు పెట్టి పంపుతున్నాడు. భగవాన్ వెంకయ్య స్వామి దర్శనం కోసం ఈ ప్రాంత వాసులే కాదు ఇతర రాష్ట్రాల నుంచి భక్తుల వస్తుంటారు. శనివారం అయితే భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. వెంకయ్యస్వామి భక్తులను టార్గెట్ చేసుకున్న తమ్ముళ్లు డైమండ్ డబ్బా జూదం ద్వారా జేబులు నింపుకుంటున్నారు. కసుమూరు దర్గా పరిసర ప్రాంతాల్లో కూడా ఇదే తరహాలో జూదం నిర్వహణ జరుగుతుందని స్థానికులు చెబుతున్నారు. కసుమూరు దర్గాకు దేశ స్థాయిలో గుర్తింపు ఉంది. పవిత్ర పుణ్యక్షేత్రంగా భావించే ఈ దర్గాకు సినిమా రంగంలో ఉన్న ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ వంటి భక్తులు కూడా వస్తుంటారు. నిత్యం భక్తుల తాకిడితో రద్దీగా ఉండే కసుమూరులో కూడా డైమండ్ డబ్బా వంటి జూదాన్ని ప్రారంభించారని స్థానికులు వాపోతున్నారు. ఆయా ప్రాంతాల్లో రోజువారీగా రూ.లక్షల్లో జూదం జరుగుతుందని సమాచారం. డైమండ్ డబ్బా నిర్వహించే సదరు టీడీపీ నేత ఎమ్మెల్యే సోమిరెడ్డికి టీడీపీ అధినేతల ఫొటోలతో భారీ ఫ్లెక్సీలతో శుభాకాంక్షలు చెబుతుండడంతో పోలీసులు సైతం అతని జోలికి వెళ్లేందుకు సాహసించడం లేదని గుసగుసలు వినిపిస్తున్నాయి. సదరు టీడీపీ నేత జూదంలో సంపాదించిన మొత్తంలో నియోజకవర్గ ముఖ్య నేతకు, పోలీసులకు వాటాలు పంచుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బహిరంగంగానే డైమాండ్ డబ్బా ఆడుతున్న టీడీపీ నేతను కట్టడి చేయకుండా సదరు ముఖ్య నేత ఆదేశాలిచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. అందుకే పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే సమాచారం.

పేకాట కేసు పక్కదోవ..

ఇటీవల వెంకటాచలం మండలంలో పేకాట ఆడుతున్న పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకుని, వారి నుంచి భారీ మొత్తంలో నగదు స్వాధీనం చేసుకున్నప్పటికీ ఆ విషయాలు బహిర్గతపరచకుండా కేసును నీరుగార్చినట్లు తెలుస్తోంది. దాదాపు 50 బైక్‌లు, 70 మందిని పట్టుకున్నట్లు సమాచారం. వీరి వద్ద నుంచి సుమారు రూ.6 లక్షలు పట్టుకున్నప్పటికీ చివరకు రూ.6 వేలు పట్టుకున్నామని పోలీసులు చెప్పడం బట్టి చూస్తే ఏ స్థాయిలో ఇక్కడ పేకాట జరుగుతుందో అర్థమవుతోంది. ఇక అధికారికంగా 25 బైక్‌లు, 18 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెబుతున్నా.. ఎంత మందిని కోర్టుకు హాజరుపరిచారో కూడా స్పష్టత ఇవ్వలేదు. టీడీపీ ముఖ్య నేతల ఒత్తిడితో ఈ కేసును నీరుగార్చినట్లు ప్రచారం జరుగుతోంది.

ప్రభుత్వ మార్పుతోనే..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే పవిత్ర పుణ్యక్షేత్రాలైన గొలగమూడి వెంకయ్యస్వామి, కసుమూరు దర్గా ప్రాంతాల్లో ఎక్కడా కూడా అనైతిక కార్యకలాపాలకు తావులేకుండా కట్టడి చేశారు. స్థానిక పోలీసులు నిరంతర పర్యవేక్షణలో ఉండే ఈ ప్రాంతాల్లో ఇప్పుడు ప్రభుత్వం మార్పుతోనే తమ్ముళ్లు అక్రమార్జన కోసం చెలరేగిపోతున్నారు. దేవుళ్ల దర్శనం కోసం వచ్చే భభక్తులను కూడా వదిలి పెట్టకుండా దోపిడీ చేస్తున్నారు.



కాయ్ రాజా కాయ్ ఆటలు ఆడిస్తున్న సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అనుచరుడు

డీసీపల్లిలో 741 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో మంగళవారం 741 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 893 బేళ్లు రాగా వాటిలో 741 బేళ్లను విక్రయించగా మిగిలిన బేళ్లను వివిధ రకాల కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో 90,573 కిలోల పొగాకును విక్రయించగా రూ.2,67,53,218 వ్యాపారం జరిగింది. కిలో గరిష్ఠ ధర రూ.358 కాగా, కనిష్ఠ ధర రూ.205 లభించింది. సగటు ధర రూ.295.38 నమోదైంది. వేలంలో 15 కంపెనీల వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇదేం.. చోద్యం

- టీడీపీ నేతల ఫోన్లలో ఉపాధి హామీ పథకం మస్టర్ యాప్‌లు

ఉలవపాడు: టీడీపీ నేతలు ప్రభుత్వ వ్యవస్థల్లోకి చొరబడ్డారు. ఉపాధి హామీ పథకం సిబ్బంది ఫోన్లలో ఉండాల్సిన మస్టర్ యాప్‌లు టీడీపీ నేతల మొబైల్స్‌లో ఉండడం చూస్తే పరిస్థితి అర్థమవుతోంది. ప్రభుత్వ ఉద్యోగుల అధికారాలను సైతం లాక్కొని వారిని డమ్మీలుగా మార్చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచే ఉపాధి పథకాన్ని తమ చెప్పు చేతుల్లోకి తీసుకున్నారు. నిబంధనలు ధిక్కరించి ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించారు. తమకు అనుకూలంగా ఉండే వారిని నియమించుకున్నారు. తాజాగా ఫీల్డ్ అసిస్టెంట్ల ఫోన్లలో ఉండాల్సిన కూలీల హాజరు యాప్ టీడీపీ నేతల ఫోన్లలో పెట్టుకుని నిర్వహిస్తుండడంతో చర్చనీయాంశంగా మారింది. టెక్నికల్ అసిస్టెంట్లు టీడీపీ నేతల కొమ్ము కాస్తూ వారి సేవలో తరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. మండలంలో 12 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు. వారికి ఎలాంటి నోటీసులు లేకుండా ఫీల్డ్ అసిస్టెంట్‌ల నుంచి యాప్‌లు నాయకులకు మార్చడంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుంది. చాగల్లులో దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని తొలగించి ఎమ్మెల్యే తన సొంత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి యాప్‌ను ఎక్కించాడు. ఉలవపాడులో వితంతు మహిళను తొలగించి మండల అధ్యక్షుడు బీసీ నాయకుడి కుమారుడికి యాప్ పర్మిషన్ ఇచ్చారు. వీరేపల్లి, రామాయపట్నం, బద్దిపూడి, కృష్ణాపురం, చాకిచర్ల, పెదపట్టపుపాళెం, కరేడు గ్రామాల్లోనూ ఇలానే మార్పులు చేశారు.

మెస్, కాస్మోటిక్ చార్జీలను తక్షణమే చెల్లించండి




కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

- సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో భోజన నాణ్యత కొరవడింది
- కలెక్టరేట్ ఎదుట విద్యార్థులతో ఏఐఎస్‌ఎఫ్ ధర్నా

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలను తక్షణమే చెల్లించాలని, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మస్తాన్ షరీఫ్ మాట్లాడుతూ గతేడాది నవంబర్ నుంచి మెస్, కాస్మోటిక్ చార్జీలను చెల్లించాల్సి ఉందన్నారు. అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్ వార్డెన్లు విద్యార్థులకు నాణ్యమైన సరుకులతో కూడిన భోజనాన్ని అందించలేకపోతున్నారని వాపోయారు. నెల రోజుల్లో సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించకపోతే చలో సచివాలయానికి పిలుపునిస్తామని హెచ్చరించారు. 15 రోజులుగా జిల్లా వ్యాప్తంగా ఉన్న సాంఘిక సంక్షేమ వసతి గృహాలను సందర్శించామని, ప్రస్తుత గృహాల్లో అనేక సమస్యలను గుర్తించామన్నారు. మెస్ చార్జీలను విడుదల చేయకపోవడంతో హాస్టల్ వార్డెన్లు అప్పుల పాలవుతున్నారని, పూర్తిస్థాయిలో వార్డెన్స్ లేరని తక్షణమే జిల్లా అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో వార్డెన్స్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్‌ఓకు లవన్నకు ఏఐఎస్‌ఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్‌కిషోర్, నెల్లూరు నగర అధ్యక్షుడు శివం వర్మ, జిల్లా నాయకులు ప్రసాద్, అబ్దుల్, అక్షయ్, వెంకటేష్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులకు నోటీసులు



ఆత్మకూరు: పట్టణంలోని జేఆర్‌పేట మెయిన్ బజారు పక్కనే ఉన్న కొలగాని రామయ్య సత్రం స్థలం ఆక్రమణదారులకు దేవదాయ శాఖాధికారులు మంగళవారం సాయంత్రం నోటీసులు జారీ చేశారు. సర్వే నంబరు 1965/ఎలో సత్రంకు సంబంధించిన స్థలాన్ని పలువురు ఆక్రమించి వ్యాపార గదులు, ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. దీనిపై సత్రం ట్రస్ట్ సభ్యులు దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు అధికారులు నోటీసులు అందజేశారు. ఏళ్ల తరబడి ఆ ప్రాంతంలో ఇళ్లు కట్టుకుని నివశిస్తున్న పేదలు ఆందోళనకు గురవుతున్నారు. అయితే కొందరు వ్యాపారులు వ్యాపారాలు నిర్వహించుకునేందుకు మెయిన్ రోడ్డుకు ఆనుకుని స్థలాలు ఆక్రమించి గదులు కట్టి అద్దెలకు ఇచ్చుకున్నారు. కొందరు విక్రయించారని కమిటీ సభ్యులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో నిజమైన పేదలను గుర్తించి వారికి ప్రత్యామ్నాయ స్థలాలు చూపుతామని, చిరు వ్యాపారులకు సత్రం కమిటీ ఆధ్వర్యంలోనే వ్యాపార గదులు నిర్మించి వారికే అద్దెకు ఇస్తామని అధికారులు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా ఏళ్ల తరబడి నివసిస్తున్న పేదలకు ఆక్రమణదారులంటూ నోటీసులు అందజేయడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది.

రైతులకు సమస్యగా మారిన ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ

- చోరీ జరిగిన వెంటనే కేసులు నమోదు చేయాలి
- రిటైర్డ్ జడ్జి, విద్యుత్ అదాలత్ చైర్మన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి



విద్యుత్ అదాలత్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న వినియోగదారుడు

పొదలకూరు: విద్యుత్ సరఫరాలో రైతులు ఎదుర్కొంటున్న పెద్ద సమస్య ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకు గురికావడమని విద్యుత్ అదాలత్ చైర్మన్, రిటైర్డ్ జడ్జి వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి అన్నారు. పొదలకూరు సబ్‌స్టేషన్లో మంగళవారం నెల్లూరు రూరల్, పొదలకూరు, ముత్తుకూరు సబ్‌డివిజన్లకు సంబంధించి విద్యుత్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురైన వెంటనే సంబంధిత ఏఈలు పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేస్తున్నారని, స్టేషన్ హౌస్ ఆఫీసర్ వెంటనే కేసులు నమోదు చేయకపోవడంతో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు ఆలస్యమవుతుందన్నారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కేసు నమోదు చేయనిదే కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు నిబంధనలు అనుమతించవన్నారు. దీనిపై పోలీసు ఉన్నతాధికారులు ఆలోచించాలని సూచించారు. విద్యుత్ అదాలత్‌లో ప్రధానంగా ఫ్యూజ్‌లు పోవడం, విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, కాలిపోయిన వాటి స్థానంలో కొత్తవి బిగించడం విద్యుత్ నిలిపి వేతకు కాలపరిమితి తదితర సమస్యలపై వినియోగదారులు నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. అయితే మూడు సబ్ డివిజన్ల పరిధిలో నిర్వహించిన అదాలత్‌కు కేవలం ఐదు అర్జీలు మాత్రమే అందాయి. ఇందులో ప్రధానంగా పట్టణంలోని మెయిన్‌రోడ్డులో తమకు చెందిన పట్టా స్థలంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి మార్చేందుకు ఎస్టిమేషన్ ఇస్తే తాము చెల్లిస్తామన్నారు. పొదలకూరు ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి పంచాయతీలో ఏబీ వైర్లు ఉన్నాయని, ఐదు వైర్లను కండక్టర్ వైర్లను ఏర్పాటు చేయించాల్సిందిగా వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ మెంబర్ కే రామమోహన్‌రావు, టెక్నికల్ మెంబర్ ఎస్‌ఎల్ అంజనీకుమార్, కన్జుమర్ అఫైర్స్ మెంబర్ గాయం ఈశ్వరమ్మ, డీఈ సోమశేఖర్, ఏడీఈ సురేంద్రబాబు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి మృతిపై కలెక్టర్‌కు చేరిన నివేదిక

నెల్లూరు (టౌన్): నగరంలోని భక్తవత్సలనగర్‌లోని కేఎన్నార్ ప్రాథమిక పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న గురు మహేంద్ర మృతికి సంబంధించి ఎట్టకేలకు పది రోజుల తర్వాత మంగళవారం కలెక్టర్ ఆనంద్‌కు నివేదికను అందజేశారు. అయితే జిల్లా ఉన్నతాధికారులు ఒత్తిళ్లకు లొంగి బాధ్యులపై చర్యలకు వెనుకాడుతున్నారనే అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. విద్యార్థి మృతిపై జిల్లా విద్యాశాఖ అధికారులు పది రోజుల పాటు విచారణ చేపట్టిన విధానం బట్టి అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గత నెల 26న కేఎన్నార్ స్కూల్‌లో అదనపు తరగతి గది సన్‌షేడ్ కూలి విద్యార్థి గురుమహేంద్ర మృతి చెందిన విషయం తెలిసిందే. విద్యార్థి మృతిపై విచారణకు డిప్యూటీ డీఈఓ ప్రసన్నలక్ష్మితో పాటు ఇద్దరు సహాయకులను నియమించారు. త్వరితగతిన విచారణ నివేదికను అందజేయాలని ఆదేశించారు. కాగా విద్యార్థి మృతి చెందిన మరుసటి రోజు డీఈఓకు తెలియకుండానే స్కూల్ హెడ్‌మాస్టర్ స్కూల్‌కు సెలవు ప్రకటించారు. ఆ మరుసటి రోజు ఆదివారం కావడంతో ఎవరూ అందుబాటులో లేకుండా పోయారు. సోమవారం గ్రీవెన్స్ సమయానికి నివేదికను అందజేయాలని జిల్లా విద్యాశాఖాధికారిని ఆదేశించడంతో డిప్యూటీ డీఈఓ ప్రసన్నలక్ష్మి కొద్ది సమయంలోనే పాఠశాలలోని విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి నివేదికను రూపొందించారు. అయితే నివేదిక సమగ్రంగా ఉండాలంటే సమయం కావాలని కోరడంతో మరో రెండు రోజులు గడువు ఇచ్చినట్లు తెలిసింది. నివేదికను సిద్ధం చేసినా డీఈఓ అందుబాటులో లేకపోవడంతో పక్కన పడేశారు. ఎట్టకేలకు నివేదికను డీఈఓ రామారావు కలెక్టర్ ఆనంద్‌కు అందజేశారు. పాఠశాలలో ఉపాధ్యాయుల మానటరింగ్, అటు వైపు విద్యార్థులు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోకపోవడం, హెడ్‌మాస్టరు, ఉపాధ్యాయుల నిర్లక్ష్యంతో విద్యార్థి మృతి చెందాడని తల్లిదండ్రులు, బంధువులు, విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. బాధ్యులపై చర్యలను దాటవేస్తారనే అనుమానాలను విద్యార్థి తరఫు వారు వ్యక్తం చేస్తున్నారు.

లైబ్రేరియన్‌పై చర్యలకు సిఫారసు

ఆత్మకూరు: స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న లైబ్రేరియన్ పసుపులేటి శ్రీనివాసులుపై చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ కు సిఫారస్సు చేస్తూ డీఈఓ లేఖ రాశారు. ఈ విషయాన్ని హెచ్‌ఎం మంగళవారం తెలిపారు.

పెన్నమ్మ చెర

- శంకరనగరంలో తెలుగు తమ్ముళ్ల ఇసుక దందా
- రాత్రి వేళల్లో తోడి సమీపంలో డంపింగ్
- అక్కడి నుంచి రోజూ 50 టిప్పర్లు, లారీలతో చెన్నై, బెంగళూరుకు రవాణా
- వారం రోజులుగా జరుగుతున్నా పట్టించుకోని అధికారులు

పట్టించుకోని అధికారులు

ఆత్మకూరు నియోజకవర్గాన్ని అక్రమాలకు అడ్డాగా మార్చేసి సహజ వనరులను దోచుకుంటున్నా జిల్లా అధికార యంత్రాంగం కళ్లప్పగించి చూస్తోంది. జిల్లా మైనింగ్, పోలీసులు, సెబ్, రెవెన్యూ అధికారులు అక్రమార్కులతో భాగస్వాములై వారిచ్చే ముడుపులతో కళ్లకు గంతలు కట్టుకుంటున్నారు. ఎవరైనా పోలీసులకు సమాచారం అందించినా.. అటు వైపు వెళ్లేందుకు ఇష్టపడడం లేదనే ఆరోపణలున్నాయి. కళ్ల ముందే ఇసుక, మట్టి అక్రమ రవాణా సాగుతున్నా.. తమకేమి పట్టదన్నట్లుగా అధికారుల వ్యవహార శైలి ఉండడంతో ప్రజలు ఛీదరించుకుంటున్నారు.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: అడవి పండింది.. కాకుల పాలైంది అన్నట్టు.. టీడీపీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ నేతలు సహజవనరులను దోచేస్తున్నారు. విచ్చలవిడిగా ఇసుక, మట్టి, గ్రావెల్ రవాణా చేస్తున్నా.. ధైర్యం చేసి అడిగే దిక్కులేకుండా పోయింది. కట్టడి చేయాల్సిన సంబంధిత శాఖల అధికారులు సైతం చేష్టలుడిగి చూస్తున్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. పెన్నమ్మ గర్భాన్ని ఎక్కడికక్కడ చెరపట్టి తోడేస్తున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుసటి రోజు నుంచి ఆత్మకూరు ప్రాంతంలో అక్రమార్కులు బరితెగించి రెచ్చిపోతున్నారు. మర్రిపాడు డంపింగ్ యార్డులో ఉన్న రూ.కోట్ల విలువైన ఇసుకను రాష్ట్ర సరిహద్దులు దాటించి సొమ్ము చేసుకున్నారు. ప్రస్తుతం డంపింగ్ యార్డులో ఉన్న కొద్దిపాటి ఇసుకను రకరకాల విన్యాసాలతో కొల్లగొడుతున్నారు. యార్డుల్లో ఇసుక అయిపోవడంతో నేరుగా నదిలో పడి కొల్లగొడుతున్నారు. తాజాగా అనంతసాగరం మండలం శంకరనగరం సమీపంలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది.

శంకరనగరం నుంచి ఇతర రాష్ట్రాలకు

శంకర నగరం సమీపంలో ఉన్న పెన్నానది నుంచి రాత్రి వేళల్లో ఇసుక తోడేస్తున్నారు. నదిలో భారీ యంత్రాలు పెట్టి దాదాపు 50కు పైగా ట్రాక్టర్ల ద్వారా ఇసుకను గ్రామ సమీప ప్రాంతంలో డంపింగ్ చేయిస్తున్నారు. ఆ డంపింగ్ పాయింట్‌లో మరో భారీ యంత్రంతో టిప్పర్లు, లారీలకు లోడింగ్ చేసి చెన్నై, బెంగళూరు వంటి నగరాలకు అక్రమంగా రవాణా చేస్తున్నారు. వారం రోజులుగా రాత్రి వేళల్లో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. నిత్యం దాదాపు 50 పైగా 12 టైర్ల లారీ ద్వారా 20 వేల టన్నుల ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం టన్ను రూ.375 వంతున ప్రతి రోజూ దాదాపు రూ.75 లక్షల టీడీపీ నేతలు తమ జేబుల్లో వేసుకుంటున్నారు. ప్రతి రోజు రాత్రి 10 నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు అక్రమ దందా నడుస్తోంది. రాత్రంతా వాహనాలు జిల్లా సరిహద్దులు దాటుతున్నా అధికారులు మాత్రం కళ్లప్పగించి చూస్తున్నారు తప్ప చర్యలు తీసుకోవడం లేదు.



శంకరనగరంలో ఏర్పాటు చేసిన ఇసుక డంపింగ్

బాబూ.. నేతన్నలపై చిన్నచూపేల?

జిల్లాలో ఎంతోమంది చేనేత కార్మికులు వస్త్ర రంగంలో తమకంటూ గుర్తింపు పొందారు. చీరల రూపకల్పనతో ప్రత్యేక ముద్ర వేశారు. ఒకప్పుడు వారి జీవితాలు దుర్భరంగా ఉండేవి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాగానే నేతన్న నేస్తం పథకం ప్రవేశపెట్టి అండగా నిలిచారు. కూటమి ప్రభుత్వం రావడంతో చేనేతల జీవితాల్లో మళ్లీ చీకట్లు అలుముకున్నాయి. బుధవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా 'సాక్షి' కథనం.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నేతన్న నేస్తం పథకం అమలు

- ఏటా రూ.24 వేలు అందజేత
- ఆ పథకంపై స్పష్టత ఇవ్వని కూటమి ప్రభుత్వం
- జాతీయ చేనేత దినోత్సవం నేడు



మగ్గం నేస్తున్న చేనేత కార్మికుడు (ఫైల్)



నెల్లూరు(బారకాసు): ఆధునిక యంత్ర కోరలకు చేనేత బతుకులు దారుణంగా తయారయ్యాయి. అటు కులవృత్తిని వదులుకోలేక, ఇటు కొత్త పనులు చేయలేక నేతన్న సతమతమవుతున్నాడు. కుటుంబమంతా కలిసి రోజంతా పని చేసినా పూట గడవని దుస్థితి. చెమటోడ్చి నేసిన వస్త్రాలను అమ్ముకుందామంటే కొనే నాథుడు లేడు. ఆదుకోవాల్సిన సర్కారు చేయూతనివ్వడం లేదు.

ఎన్నో కుటుంబాలు

జిల్లా వ్యాప్తంగా 15,000 కుటుంబాలు చేనేత పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నాయి. కోవూరు, పాటూరు, నారాయణరెడ్డిపేట, సౌత్‌మోపూరు, ములుముడి, బుచ్చిరెడ్డిపాళెం, వింజమూరు, కాటేపల్లి, జోలగుంటపాడు, చంద్రపడియ, జమ్మారం, దగదర్తి, చెన్నూరు గ్రామాల్లోని వారు ఈ పరిశ్రమపై ఆధారపడ్డారు. ప్రస్తుత పరిస్థితుల్లో రోజంతా కష్టపడినా కుటుంబం మొత్తానికి రూ.300 మించి రావడం లేదు.

గత ప్రభుత్వంలో..

2019 సంవత్సరానికి ముందు చేనేతల జీవితాలు దారుణంగా ఉండేవి. కొనేవాడు లేక మగ్గం మూలన పడింది. వస్త్రాలు నేయడం తప్ప మరో పని తెలియని కార్మికులు కొందరు మట్టి పనులకు వెళ్లిన సందర్భాలున్నాయి. ఎంతోమంది పస్తులతో జీవన పోరాటం చేశారు. పాదయాత్రలో నేతన్నల కష్టాలు తెలుసుకున్న వైఎస్ జగన్ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగానే చేనేత కుటుంబాలకు అండగా నిలిచారు. 'నేతన్న నేస్తం' పథకం ద్వారా ఒక్కో కుటుంబానికి ఏటా రూ.24,000 చొప్పున ఇచ్చారు. దీంతో చేనేత కుటుంబాలు అవసరాలు తీర్చుకోగా, మరికొందరు వారి బిడ్డల చదువులకు ఉపయోగించారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఈ పథకంపై నీలినీడలు కమ్ముకున్నాయి. చంద్రబాబు సర్కారు ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో నేతన్నలు ఆందోళన చెందుతున్నారు.

ఎన్నో సమస్యలు

వస్త్రోత్పత్తి రంగంలో అనేక సమస్యలున్నాయి. నూలు కొనుగోలు నుంచి దుస్తుల అమ్మకం వరకు కొందరు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోనే పరిశ్రమ ఉంది. దీని కారణంగా కార్మికులకు మెరుగైన ఉపాధి కరువైంది. ప్రభుత్వమే నూలు డిపోలను ఏర్పాటు చేసి, ముడిసరుకు అందిస్తే మేలు. ఇంకా కార్మికులకు బీమా కల్పించడం, పొదుపు పథకం అమలు చేయడం, హెల్త్‌కార్డులివ్వడం, కార్మికుల భార్యలకు గార్మెంట్ రంగంలో ఉపాధి కల్పించడం, వారి పిల్లలకు ఉచిత విద్య, వైద్యం తదితర సౌకర్యాలు కల్పిస్తే మేలు. ఉత్పత్తులను కార్మికులే మార్కెటింగ్ చేసే విధంగా చేనేత బజార్లు పెట్టాలి. జీఎస్టీని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా రద్దు చేయాలి. లేనిపక్షంలో రాష్ట్ర ప్రభుత్వం దానిని భరించాలి.

కార్మికుల పొట్ట నింపాలి



వస్త్ర పరిశ్రమలో శ్రమించే కార్మికుల పొట్ట నింపేలా ప్రభుత్వ విధానాలు ఉండాలి. వస్త్రోత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేయాలి. స్థానికంగా నూలు డిపోలు ఏర్పాటు చేసి, నేరుగా నూలు అందించాలి. కార్మికుల సంక్షేమానికి బాటలు వేయాలి.

– బుధవరపు బాలాజీ, జిల్లా అధ్యక్షుడు, చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ

మాకు తెలిసిన పని ఇదొక్కటే



చేనేత పరిశ్రమను నమ్ముకుని జీవనం సాగిస్తున్నాం. ఒకప్పుడు పని చేస్తే ఆదాయం బాగా వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కనీసం రోజు వారీ కూలి కూడా గిట్టుబాటు కావడం లేదు. మాకు తెలిసిన పని ఇదొక్కటే. కాబట్టి ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలి.

– పి.శ్రీలక్ష్మి, చేనేత కార్మికురాలు, నారాయణరెడ్డిపేట

చేయూతనిస్తేనే నిలబడతాం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నేతన్న నేస్తం పథకం ద్వారా ఏటా రూ.24 వేలు ఆర్థిక సహాయాన్ని అందించింది. అదేవిధంగా ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం కూడా పథకం ప్రవేశపెట్టి చేయూతనందించాలి. లేకుంటే మా బతుకులు దుర్భరంగా మారే అవకాశం ఉంది.

– రత్నం, చేనేత కార్మికుడు, నారాయణరెడ్డిపేట

క్లుప్తంగా

లారీ బోల్తా

- డ్రైవర్ నిద్ర మత్తే కారణం



ఘటనా స్థలంలో లారీ

మర్రిపాడు: డ్రైవర్ నిద్ర మత్తు కారణంగా లారీ బోల్తా పడిన ఘటన మండలంలోని నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై మంగళవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. కృష్ణపట్నం పోర్టు నుంచి బొగ్గులోడుతో కర్ణాటక రాష్ట్రానికి లారీ వెళ్తోంది. పొంగూరుకండ్రిక సమీపానికి వచ్చే సరికి డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో జాతీయ రహదారి పక్కనే వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో విద్యుత్ స్తంభం నేలకూలింది. డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

కమిటీ ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(దర్గామిట్ట): మాన్యువల్ స్కావెంజర్ల పునరావాసం కమిటీ ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ కార్యాలయం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. మొత్తం నలుగురుంటారని, ఇందులో ఇద్దరు మహిళా సభ్యులు ఉంటారన్నారు. ఆసక్తి గల వారు తమ బయోడేటాతో దరఖాస్తులను ఈనెల 10వ తేదీలోగా జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయంలో ఇవ్వాలని తెలియజేశారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) : 97
లేయర్ (లైవ్) : 90
బ్రాయిలర్ చికెన్ : 186
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 206
లేయర్ చికెన్ : 153

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.80
సన్నవి	: రూ.50
పండ్లు	: రూ.40

గుట్టుచప్పుడు కాకుండా అభిప్రాయ సేకరణ

- మైనింగ్ కోసం సమావేశం నిర్వహణ
- ప్రజాప్రతినిధులకు, ప్రజలకు సమాచారం ఇవ్వకుండానే..



మాట్లాడుతున్న అధికారులు

పొదలకూరు: పొదలకూరుకు సమీపంలో చిట్టేపల్లి తిప్ప 707 సర్వే నంబర్‌లో ఓపెన్ కాస్ట్ క్వార్ట్జ్ మైనింగ్ నిర్వహణ కోసం మంగళవారం కాలుష్య నియంత్ర మండలి అధికారులు ప్రజాభిప్రాయ సేకరణను నిర్వహించారు. మైనింగ్ నిర్వాహకులు ఈ కార్యక్రమాన్ని గుట్టుచప్పుడు కాకుండా నిర్వహించారనే విమర్శలున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు, మీడియాకు సమాచారం ఇవ్వకుండా బయట ప్రాంతాల నుంచి ప్రజలను తీసుకొచ్చినట్లు చెబుతున్నారు. గతనెలలో ఇదే అభిప్రాయ సేకరణ రసాభాసగా మారింది. నెల్లూరు ఆర్డీఓ మలోల హాజరయ్యారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇక్కడ మైనింగ్ నిర్వహించేందుకు వీలులేదని స్థానికులు పెద్ద ఎత్తున నిరసన గళం వినిపించిన విషయం తెలిసిందే.

- కాగా మంగళవారం నాటి కార్యక్రమానికి ఇన్‌చార్జి జేసీ సూర్యతేజ హాజరై మాట్లాడారు. వర్ధూరు భాస్కరయ్య 2.574 హెక్టార్ల విస్తీర్ణంలో 74,829 క్యూబిక్ మీటర్లను ఏడాదికి మైనింగ్ నిర్వహించేందుకు అనుమతులు పొందినట్లు చెప్పారు. నిర్వాహకులు గాలి, నీరు కాలుష్యం కాకుండా నిబంధనల ప్రకారం మైనింగ్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. కాలుష్యం నెలకొంటే సంబంధిత శాఖ అధికారులు జరిమానాలు విధించవచ్చన్నారు. గ్రామస్తులకు సహకరించాలని ఆదేశించారు. నివేదికను స్టేట్ ఎన్విరాన్‌మెంట్ అసెస్‌మెంట్‌కు పంపడం జరుగుతుందన్నారు. అనంతరం కాలుష్య నియంత్ర మండలి ఈఈ రాజశేఖర్ మాట్లాడారు.

చికిత్స నిమిత్తం నెల్లూరుకు వెళ్లగా..

- ఆత్మకూరు పట్టణంలో భారీ చోరీ
- రూ.10 లక్షల విలువైన నగలు, నగదు అపహరణ



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

ఆత్మకూరు: పట్టణంలో ఆర్టీసీ డిపో ఎదురు వీధిలో ఎల్ఆర్‌పల్లి ప్రాంతంలో భారీ చోరీ జరిగింది. బాధితులు, పోలీసులు మంగళవారం వివరాలు వెల్లడించారు. పద్మశేఖర్‌రెడ్డి, సుభాషిణి దంపతులు టీచర్లుగా పనిచేస్తున్నారు. పద్మశేఖర్‌రెడ్డికి అనారోగ్యం కారణంగా చికిత్స నిమిత్తం ఐదురోజుల క్రితం భార్యతో కలిసి నెల్లూరులోని ఆస్పత్రికి వెళ్లారు. సోమవారం సాయంత్రం ఆ ఇంటి తలుపు తీసి ఉండడాన్ని పాలు పోసే మహిళ గుర్తించింది. ఆమె చుట్టుపక్కల ఇళ్ల వారికి సమాచారం ఇచ్చింది. వారి ద్వారా విషయం తెలుసుకున్న దంపతులు పోలీసులకు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. వెంటనే సిబ్బంది వచ్చి పరిశీలించారు. బాధితులు నెల్లూరు నుంచి మంగళవారం వచ్చారు. ఎస్సై కె.ముత్యాలరావు తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి దొంగతనం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. నెల్లూరు నుంచి క్లూస్‌టీం బృందాన్ని పిలిపించి వేలిముద్రలు సేకరించారు. బీరువాలో ఉంచిన 15 సవర్ల బంగారు నగలతో పాటు 750 గ్రాములకుపైగా వెండి వస్తువులు, రూ.5 వేలు నగదు చోరీ గురైనట్లు ఇంటి యజమానులు చెప్పారు. సొత్తు విలువ రూ.10 లక్షలు ఉంటుందని తెలిపారు. కేసు నమోదు చేసి ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు. కాగా డివిజన్ పరిధిలో ఇటీవల తాళం వేసి ఉన్న ఇళ్లనే లక్ష్యంగా చేసుకుని చోరీలు జరుగుతున్నాయి. దీంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వచ్చే నెల నుంచి పశుగణన

- పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ కోటేశ్వరరావు



నమూనా సర్వేలో పాల్గొన్న అధికారులు

నెల్లూరు(అర్బన్): వచ్చేనెల ఒకటో తేదీ నుంచి జిల్లాలో అఖిల భారత 21వ పశుగణన జరుగుతుందని పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ కోటేశ్వరరావు తెలిపారు. నగరంలోని రైల్వే ఫీడర్స్ రోడ్డులోని ఆ శాఖ కార్యాలయంలో నెల్లూరు డివిజన్‌కు సంబంధించిన ప్రాంతీయ పశువైద్యశాలల సిబ్బందికి మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు సంపద పెరిగితే ప్రజలకు ఉపాధి, ఆదాయ మార్గాలు పెరుగుతాయన్నారు. సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి రైతులను అడిగి వివరాలను నమోదు చేయాలన్నారు. విజయవాడ నుంచి వచ్చిన రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ శ్రీనివాసరాజు మాట్లాడుతూ 2022 – 23లో ఈ రంగం నుంచి రూ.1.36 లక్షల కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. ప్రభుత్వం పథకాలు ప్రవేశపెట్టడానికి అవసరమైన గణాంకాలు పక్కాగా ఉండాలన్నారు. శిక్షణలో భాగంగా మధ్యాహ్నం నుంచి నగర సమీపంలో ఉన్న పొట్టేపాళెంలో నమూనా సర్వేను చేసి, రైతులతో మాట్లాడి సిబ్బందికి అవగాహన కల్పించారు. సమావేశంలో ఆ శాఖ ఉపసంచాలకులు డాక్టర్ నాగమణి, డాక్టర్ సోమయ్య, డాక్టర్ మంజునాథసింగ్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



చెన్నకేశవులు మృతదేహం

సీతారామపురం: మండలంలోని బెస్తకాలనీలో అంకాళమ్మ ఆలయం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తగిలి గారపాటి చెన్నకేశవులు (45) అనే వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. అయ్యవారిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన చెన్నకేశవులు ప్రైవేట్‌గా కరెంట్ పనులు చేసుకుంటూ స్థానిక తోటకాలనీలో నివాసముంటున్నాడు. అతనికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మంగళవారం బెస్తకాలనీలోని ఓ ఇంట్లో విద్యుత్ రిపేరుకు వెళ్లాడు. పని పూర్తయిన తర్వాత సరఫరా పునరుద్ధరణ కోసం సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లాడు. ఈ సమయంలో షాక్‌కు గురైనట్లు స్థానికులు తెలిపారు. సరఫరా ఎంతకీ రాకపోవడంతో స్థానికుల ఫిర్యాదు మేరకు విద్యుత్ సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లేసరికి చెన్నకేశవులు పడిపోయి ఉండడాన్ని గమనించారు. 108 అంబులెన్స్‌లో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యసిబ్బంది పరీక్షించి చెన్నకేశవులు మృతిచెందినట్లు నిర్ధారించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కాలనీవాసులు వేడుకుంటున్నారు.

చేపల వ్యాపారిపై దాడి

నెల్లూరు(క్రైమ్): వ్యాపారంలో నెలకొన్న విభేదాల నేపథ్యంలో చేపల వ్యాపారిపై కొందరు దాడి చేసిన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు బీవీనగర్‌కు చెందిన పెంచలయ్య అన్నమయ్య సర్కిల్ సమీపంలో చేపలు అమ్ముతుంటాడు. అక్కడే చేపల వ్యాపారం చేస్తున్న గాయత్రి, రమణ తదితరులతో అతడికి విభేదాలున్నాయి. ఈ నేపథ్యంలో పెంచలయ్యతో ఈనెల నాలుగో తేదీ రాత్రి గాయత్రి, రమణ, నంద మరో ఏడుగురు కలిసి వాగ్వాదానికి దిగారు. అనంతరం కత్తులతో, కర్రతో దాడి చేశారు. గాయాలపాలైన ఆయన చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేరారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ప్రైవేట్ హాస్పిటల్‌కు వెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మంగళవారం దర్గామిట్ట పోలీసులు తెలిపారు.


మద్యం దుకాణంలో చోరీ



దొంగతనం జరిగిన షాపు

నెల్లూరు సిటీ: రూరల్ పరిధిలోని ఆకుతోట ప్రాంతంలో ప్రభుత్వ మద్యం షాప్‌లో గుర్తుతెలియని దుండగులు నగదు చోరీ చేశారు. పోలీసుల కథనం మేరకు.. సోమవారం మద్యం విక్రయించగా వచ్చిన నగదు రూ.2.80 లక్షలను సిబ్బంది లాకర్‌లో పెట్టి రాత్రి తాళం వేసి ఇంటికెళ్లారు. అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆ తాళాలు పగులకొట్టి షాపులోకి ప్రవేశించారు. లాకర్‌లోని నగదును తీసుకుని పరారయ్యారు. షాపు తెరిచి ఉండడాన్ని మంగళవారం తెల్లవారుజామున స్థానికులు గమనించి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కాగా సెక్యూరిటీ గార్డు కూడా లేకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కోళ్ల వ్యర్థాల పట్టివేత



మినీ లారీ వద్ద అధికారులు

సంగం: మండల కేంద్రమైన సంగం ఎంజీఆర్ బ్యారేజ్ వద్ద మంగళవారం తెల్లవారుజామున కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న మినీ లారీని సంగం పోలీసులు పట్టుకున్నారు. వారి కథనం మేరకు.. చిత్తూరు జిల్లా నుంచి మినీలారీ కోళ్ల వ్యర్థాలను ఆత్మకూరుకు తీసుకెళ్లింది. అక్కడ కొన్ని డ్రమ్ములను దించింది. మరికొన్నింటిని సంగం కొండ మలుపు మీదుగా పొదలకూరు మండలానికి తీసుకెళ్తుండగా బ్యారేజ్ వద్ద గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు పట్టుకుని మత్స్యశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. వారంతా వ్యర్థాలను సంగం – కలిగిరి రహదారిలోని అటవీ ప్రాంతంలో గుంతతీసి పూడ్చిపెట్టారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగార్జునరెడ్డి తెలిపారు.